మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
సోమవారం 18 మే 2026 పేజీ : 1

ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- ఇంజినీరింగ్‌లో రిషికి తొలి ర్యాంక్
- అగ్రికల్చర్, ఫార్మసీలో ముకరం అహ్మద్ టాప్
- రికార్డు సమయంలో ఫలితాల ప్రకటన
- త్వరలో వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్

2

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

తొలి సమావేశం

హాజరైన మంత్రి పొన్నం, కోదండరాం, అద్దంకి దయాకర్

అమరవీరుల స్తూపం నీడలోనే కమిటీ కార్యాలయం ఏర్పాటు

త్వరలోనే సర్వసభ్య సమావేశం, జిల్లా పర్యటనలు

మళ్లీ కేసీఆర్ పాలనే అవసరం

'మన బూత్ - మన బాధ్యత'లో కేటీఆర్ వ్యాఖ్యలు

- టిమ్స్ ఆస్పత్రులపై ఆందోళనకు సిద్ధం
- కార్పొరేషన్ ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

హైదరాబాద్, మే 17: "హైదరాబాద్ నగరం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం రావాల్సిందే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన బూత్ – మన బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని, ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని కేటీఆర్ విమర్శించారు. గత రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నగరాన్ని సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టిందని ఆరోపించారు. టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, ఈ అంశంపై త్వరలోనే భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. ప్రజలకు వసతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని చేయాలని కేటీఆర్ సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి నగర సమస్యలను వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

సరస్వతీ అంత్య పుష్కరాలకు సీఎంకు ఆహ్వానం

హైదరాబాద్, మే 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పరిధిలో జరగనున్న 'సరస్వతీ నది అంత్య పుష్కరాల'కు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డికి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆలయ అర్చకులు, ఉన్నతాధికారులు ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో 'సరస్వతీ అంత్య పుష్కరాలు' అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన మంత్రి కొండా సురేఖ, ఆలయ వైదిక పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేదాశీర్వచనం అందించారు. అనంతరం పుష్కరాల విశిష్టతను వివరించి, ప్రారంభోత్సవ వేడుకలకు రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ ఈఓ మహేష్, ఆలయ ప్రధాన అర్చకులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎండలతో ఉక్కిరిబిక్కిరి

ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్

ఐదు రోజుల పాటు భారీ ఉష్ణోగ్రతల హెచ్చరిక

కొన్ని జిల్లాల్లో వర్షాల సూచన

హైదరాబాద్, మే17: తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అధిక ఎండలతో పాటు వడగాలులు వీచే అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు. కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్–మాల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన గాలి విచ్ఛిన్నతి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

తొలి సమావేశం

హాజరైన మంత్రి పొన్నం, కోదండరాం, అద్దంకి

కేకే నేతృత్వంలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, మే 17: మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అసలైన ఉద్యమకారులను, అమరవీరులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' తొలి సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. కమిటీ చైర్మన్ డాక్టర్ కే. కేశవరావు (కేకే) నేతృత్వంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ సభ్యులైన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వ పరంగా అధికారికంగా కమిటీని ఏర్పాటు చేసినందుకు ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యమకారుల త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం (జ్యోతి) ఆవరణలోనే 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అమరవీరుల సాక్షిగా పారదర్శకంగా పనులు జరగాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ కేశవరావు తెలిపారు. అలాగే, అమరవీరులు, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు త్వరలోనే ఒక భారీ 'సర్వపక్ష సమావేశాన్ని' నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. దీనితో పాటు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 నాటి ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జేఏసీ, సబ్బండ వర్గాల జేఏసీ, వివిధ కుల సంఘాలు, న్యాయవాదుల జేఏసీల నుంచి విడివిడిగా ప్రతిపాదనలు, సూచనలు స్వీకరించనున్నారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, కమిటీ సభ్యులందరూ ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల, ఉద్యమకారుల నుంచి విస్తృతంగా అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించారు. అసలైన ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ నాలుగు ప్రధాన వర్గాలను సిద్ధం చేసింది. 1. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 2. స్వరాష్ట్ర ఉద్యమ పోరాటంలో తీవ్రంగా గాయపడిన వారిని ఈ వర్గంలో గుర్తిస్తారు. 3. తెలంగాణ ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లిన భక్తులు, అరెస్టయిన వారు, పోలీసు కేసులు నమోదైన వారిని ఇందులో చేరుస్తారు. 4. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉధృతంగా పోరాటాలు చేసిన సామాన్య ఉద్యమకారులను ఈ వర్గంలో గుర్తిస్తారు. వీరి గుర్తింపు కోసం ఆయా సమయాల్లో పత్రికల్లో వచ్చిన క్లిప్పింగులు, ఆధారాలను పరిశీలిస్తారు. సివిల్ సొసైటీలో ఉంటూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖుల సలహాలు కూడా తీసుకోనున్నారు. అలాగే 1969, 1972, 1996 కాలం నాటి ఉద్యమ సీనియర్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం కొద్దిమందికి, అది కూడా రాజకీయ ప్రయోజనాల కోసమే సాయం అందిందని కమిటీ అభిప్రాయపడింది.

బండి చుట్టూ రాజకీయ సెగ

- భగీరథ్ పై పోక్సో కేసుతో పాలిటికల్ ఇమేజ్ డ్యామేజ్
- లొంగుబాటు.. అరెస్టు? భిన్న ప్రకటనలతో గందరగోళం
- హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్ కలకలం
- సోషల్ మీడియా పోస్టులపై కేసులు

హైదరాబాద్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా, ప్రతిపక్షాలు ఈ వ్యవహారంపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయి. కొన్ని రోజులుగా కనిపించకుండా ఉన్న భగీరథ్ శనివారం పోలీసుల అదుపులోకి వచ్చాడు. అయితే అతడు స్వయంగా లొంగిపోయాడా..? లేక పోలీసులు అరెస్ట్ చేశారా..? అన్న అంశంపై భిన్న ప్రకటనలు వెలువడటం కలకలం రేపుతోంది. బండి సంజయ్ మాత్రం న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించామని ప్రకటించగా, సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాల గాలింపులో భాగంగా మంచిరేవుల సమీపంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. భగీరథ్‌ను విచారించిన అనంతరం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తులో భాగంగా భగీరథ్ నేరాన్ని అంగీకరించాడని సైబరాబాద్ కమిషనరేట్ ప్రకటించడం మరో చర్చకు దారితీసింది. మరోవైపు భగీరథ్ తరఫు వర్గాలు మాత్రం ఇది బ్లాక్‌మెయిల్ ప్రయత్నమని ఆరోపిస్తున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరగడం వివాదాస్పదమైంది. బెయిల్ వ్యవహారంపై నిరాధార పోస్టులు రావడంతో హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే సమయంలో భగీరథ్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టారనే ఆరోపణలతో 14 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కూడా కేసులు నమోదయ్యాయి. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా రాజకీయంగా ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

ఇంజినీరింగ్‌లో రిషికి తొలి ర్యాంక్

అగ్రికల్చర్, ఫార్మసీలో ముకరం అహ్మద్ టాప్

రికార్డు సమయంలో ఫలితాల ప్రకటన

త్వరలో వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్

హైదరాబాద్, మే17 : రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్-2026 ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఫలితాలను ప్రకటించారు. ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం. రిషి తొలి ర్యాంకు సాధించగా, మూసాపేటకు చెందిన అన్ను రెండో ర్యాంకు, కడపకు చెందిన వంశీధర్‌రెడ్డి మూడో ర్యాంకు దక్కించుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హైదరాబాద్ విద్యార్థి ముకరం అహ్మద్ మొదటి ర్యాంకు సాధించగా, ఎల్‌బీనగర్‌కు చెందిన తాడురి సాయి వెంకట్ రెండో స్థానం, రంగారెడ్డి జిల్లా విద్యార్థిని సాహితి మూడో ర్యాంకు పొందింది. మే 4 నుంచి 11 వరకు నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలకు ఇంజినీరింగ్ విభాగంలో 2,10,766 మంది దరఖాస్తు చేయగా 1,97,241 మంది పరీక్ష రాశారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా 84,954 మంది హాజరయ్యారు. భారీ స్థాయిలో పరీక్షలు నిర్వహించినప్పటికీ కేవలం ఆరు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం ఈ ఏడాది ప్రత్యేకతగా నిలిచింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంలో తీసుకొచ్చిన డిజిటల్ సంస్కరణలతో పరీక్ష ముగిసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా మార్కులు స్క్రీన్‌పై కనిపించే విధానం అమలు చేసినట్లు అధికారులు తెలిపారు. పారదర్శకతతో పాటు వేగవంతమైన మూల్యాంకన ప్రక్రియ కారణంగానే రికార్డు సమయంలో ఫలితాలు వెల్లడించగలిగామని ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె. విజయకుమార్‌రెడ్డి వివరించారు. ఫలితాల అనంతరం విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రవేశాల కోసం వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను మరో రెండు మూడు రోజుల్లో ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

గురుకులాలకు నెలనెలా నిధులు

- డైట్, కాస్మెటిక్, అద్దె బిల్లుల చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్
- రూ.221.24 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఆమోదం
- విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం : భట్టి విక్రమార్క

హైదరాబాద్, మే 17 : రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన డైట్ చార్జీలు, కాస్మెటిక్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా విడుదల చేయాలని నిర్ణయించింది. గతంలో ఈ నిధుల చెల్లింపులు 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడంతో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. మొదట త్రైమాసిక చెల్లింపుల విధానం అమలు చేసి, ఇప్పుడు నెలవారీ చెల్లింపుల విధానాన్ని తీసుకొచ్చారు. ఈ నిర్ణయంతో విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల నిర్వహణ, భవన అద్దెల చెల్లింపులు సక్రమంగా సాగనున్నాయి. విద్యా వాతావరణం మెరుగుపడటానికి ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. నెలవారీ చెల్లింపుల విధానంలో భాగంగా వివిధ సంక్షేమ, విద్యాశాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల కోసం ప్రభుత్వం రూ.221.24 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో విద్యార్థుల సంక్షేమం, వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో మద్దతు లభించనుంది. అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

టర్బైన్ పంప్ వద్ద చెలరేగిన మంటలు..

కాలిపోయిన కేబుల్స్, వాల్వ్‌లు

నల్గొండ, మే 17 : నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ స్టేషన్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్‌లోని యూనిట్-3 పరిధిలో టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు భయాందోళనలకు గురయ్యారు. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీకేజీ కారణంగానే ఈ మంటలు వ్యాపించినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేస్తున్నారు. చమురు లీక్ కావడంతో మంటలు వేగంగా వ్యాపించి ప్లాంట్ ఆవరణ అంతటా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతకు పంప్ పరిధిలోని కంట్రోల్ కేబుల్స్, కొన్ని కీలక వాల్వ్‌లు పూర్తిగా కాలిపోయాయి. అయితే ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వ్యవస్థతో పాటు సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రధాన యంత్రాలకు భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. నష్టం తీవ్రతను అంచనా వేయడంతో పాటు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు అంతర్గత దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీ ట్రైనింగ్ క్యాంపెయిన్‌పై అసంతృప్తి

తెలంగాణలో ప్రశిక్షణ వర్గాల నిర్వహణపై విమర్శలు

కమిటీలు పూర్తి కాకముందే శిక్షణ తరగతులు

'ఫార్మాలిటీగా మారింది' అంటున్న నేతలు

హైదరాబాద్, మే 17 : దేశవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ట్రైనింగ్ మెగా కాంపెయిన్ తెలంగాణలో కొనసాగుతున్నప్పటికీ, రాష్ట్ర యూనిట్‌లో ఈ కార్యక్రమంపై అంతర్గత అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ బలోపేతం, సిద్ధాంత అవగాహన, కేడర్ సమన్వయం లక్ష్యంగా నిర్వహిస్తున్న శిక్షణా వర్గాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో స్పష్టత లోపించిందని, కింది స్థాయి కమిటీలు పూర్తికాకముందే తరగతులు నిర్వహించడం వల్ల పాల్గొనేవారి ఎంపికలో గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో కేవలం సంఖ్య పెంచేందుకు బాధ్యతలు లేని వారిని కూడా హాజరు పరచారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులపై కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేని వారిని సమీకరించి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్యక్రమాల నిర్వహణ తీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలో జిల్లా స్థాయి ప్రశిక్షణ వర్గాలు ప్రారంభం కానున్నప్పటికీ, అనేక జిల్లాల్లో మోర్చా కమిటీలు ఇంకా పూర్తికాలేదని సమాచారం. కమిటీ నిర్మాణం, బాధ్యతల పంపిణీ పూర్తికాకముందే శిక్షణపై దృష్టి పెట్టడం వల్ల కేడర్‌లో ఆసక్తికన్నా అయోమయం పెరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర నాయకత్వం పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం కేవలం నిర్వహణ పరమైన ప్రక్రియగా ముందుకు తీసుకెళ్తోందన్న చర్చ పార్టీలో సాగుతోంది. సిద్ధాంత బలోపేతం కంటే హాజరు పట్టికలకే ప్రాధాన్యం పెరిగిందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

మళ్లీ తెరపైకి 'ఐ బొమ్మ' వివాదం

పైరసీ వెబ్‌సైట్లపై ఫిలిం ఛాంబర్ ఫిర్యాదు

'బప్పం టీవీ'పై కూడా కేసు నమోదు

కొత్త వెబ్‌సైట్‌తో సంబంధం లేదన్న ఇమంది రవి

హైదరాబాద్, మే 17: తెలుగు సినీ పరిశ్రమను మరోసారి కలవరపెడుతూ 'ఐ బొమ్మ' వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. పైరసీ వెబ్‌సైట్ల ద్వారా కొత్త సినిమాలను అక్రమంగా విడుదల చేస్తున్నారంటూ ఫిలిం ఛాంబర్ ఆదివారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' పేర్లతో నడుస్తున్న వెబ్‌సైట్లు తాజాగా విడుదలైన పలు సినిమాలను ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్నాయని సినీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఫిలిం ఛాంబర్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గతంలో 'ఐ బొమ్మ' పేరుతో ప్రచారంలోకి వచ్చిన ఇమంది రవి ఈ వ్యవహారంపై స్పందించారు. ప్రస్తుతం నడుస్తున్న కొత్త 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన పేరును, 'ఐ బొమ్మ' బ్రాండ్‌ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల విడుదలైన పలు తెలుగు సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లలో దర్శనమివ్వడం సినీ పరిశ్రమలో ఆందోళన కలిగిస్తోంది. భారీ బడ్జెట్ సినిమాల కలెక్షన్లపై దీని ప్రభావం పడుతోందని నిర్మాతలు, దర్శకులు చెబుతున్నారు. 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్ల నిర్వాహకుల గుర్తింపుపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు. సర్వర్లు ఎక్కడి నుంచి నిర్వహిస్తున్నారు? వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సినీ పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరుతోంది.

భగీరథ్‌ను అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫలం

మూడు వ్యవస్థలు ముద్దాయిలుగా మారాయి

సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ

హైదరాబాద్, మే 17 : యువతులపై లైంగిక దాడులకు పాల్పడిన పలువురిని ఎన్‌కౌంటర్ చేసిన రాష్ట్ర పోలీసులు.. భగీరథ్‌ను అరెస్ట్ చేయడంలో మాత్రం విఫలమయ్యారని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ ఆరోపించారు. భగీరథ్ కోసం పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెబుతున్నారని, ఆ బృందాలు గోర్లు తీసుకుంటున్నాయా అని ఎద్దేవా చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ.. భగీరథ్‌ను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతుండగా, మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించానని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఈ కేసులో భగీరథ్ ముద్దాయిగా మారాడని, కోర్టు అసమర్థత కూడా బయటపడిందని ఆరోపించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే అరెస్ట్ చేసి ఉంటే ఈ స్థాయికి వ్యవహారం వెళ్లేది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో తప్పు చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ.. ఈ మూడు వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. కేసు నమోదైన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించి ఉంటే ఇంత వివాదం జరిగేది కాదన్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, న్యాయవ్యవస్థ కూడా ముద్దాయిలుగా నిలిచాయని ఆరోపించిన సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ.. ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భగీరథ్‌పై పోలీసులు ఏ విచారణైనా చేయొచ్చు

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 17 : పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీసులకు లొంగిపోయాడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారం పూర్తిగా రాష్ట్ర పోలీసుల పరిధిలోనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి స్వతంత్రంగా దర్యాప్తు చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. బండి భగీరథ్‌పై పోలీసులు ఎలాంటి విచారణైనా నిర్వహించవచ్చని వెల్లడించారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో కేంద్రమంత్రి అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను అక్కడి పోలీసులు అడ్డుకున్న ఘటనను ప్రస్తావిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని తెలిపారు. శనివారం పోలీసులకు లొంగిపోయిన బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ అనంతరం చర్లపల్లి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. మరోవైపు ధాన్యం కొనుగోళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ప్రతి పైసాను కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని, అయినప్పటికీ రైతుల నుంచి ధాన్యం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రులు జిల్లాల వారీగా పర్యటిస్తూ ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

15వ అంతస్తు పైనుంచి దూకి బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కూకట్‌పల్లి : మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అపార్ట్‌మెంట్ 15వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం కాశ్మీరి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పుష్ప కుమార్ టిక్కూ (66), తన కుటుంబంతో కలిసి మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్, టవర్-2లోని ఫ్లాట్ నంబర్ 1502లో నివసిస్తున్నారు. గత ఆరేళ్లుగా ఆయన తీవ్రమైన మెదడు నరాల సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆయన, ఆదివారం తెల్లవారుజామున సుమారు 3:55 గంటల ప్రాంతంలో తన ఫ్లాట్ ఉన్న 15వ అంతస్తు నుండి కిందకు దూకారు. తీవ్ర గాయాలవ్వడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు వర్క్ బుక్స్

- 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక మాడ్యూల్స్
- జూన్ చివరికల్లా పంపిణీ లక్ష్యం
- 90 శాతం పుస్తకాలు ఇంగ్లీష్ మీడియంలోనే

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ప్రత్యేక వర్క్ బుక్స్ అందజేయాలని నిర్ణయించింది. జూన్ నెలాఖరు నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వీటిని పంపిణీ చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించిన వర్క్ బుక్స్‌ను సులభంగా అర్థమయ్యేలా కన్వర్జేషన్ విధానంలో రూపొందిస్తున్నారు. విద్యార్థులు పాఠాలు విన్న వెంటనే ప్రాక్టీస్ చేసే విధంగా మాడ్యూల్స్ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే వర్క్ బుక్స్ ముద్రణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. "నిరంతర సాధన ద్వారానే విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించగలరు" అన్న అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ వర్క్ బుక్స్ ఉపయోగపడనున్నాయి. మొత్తం ముద్రించనున్న పుస్తకాల్లో దాదాపు 90 శాతం ఇంగ్లీష్ మీడియంలోనే ఉండనున్నాయి. దీనివల్ల విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు పెరగడంతో పాటు సబ్జెక్టులపై అవగాహన మరింత మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

భగీరథ్ కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలి

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హైదరాబాద్, మే 17: బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో మాట్లాడిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజుల పాటు దాచి పెట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తి కేంద్రమంత్రి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. దేశానికే అవమానకరమని విమర్శించారు. కేంద్ర మంత్రి కుమారుడు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని ఆరోపించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. బాధిత బాలిక తల్లిదండ్రులను స్వయాన కేంద్ర మంత్రే భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు.

ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అని చెప్పడం మాత్రమే సరిపోదని, ఆ నినాదాలకు అనుగుణంగా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీస్ జారీ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కేసును నీరుగార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. హనీ ట్రాప్ పేరుతో మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కలిసి వార్తలు బయటకు రానీయకుండా చేశారని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. అలా చేయకపోతే అన్యాయం జరిగినా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసే ధైర్యం ఆడబిడ్డలకు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రమంత్రి ఎన్ని రకాల ఒత్తిళ్లు తీసుకొచ్చినా బాధిత బాలికకు ఆమె తల్లి అండగా నిలిచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమ్మక్కై బాలికకు అన్యాయం చేయాలని చూసినా.. ఆ కుటుంబం వెనక్కి తగ్గలేదని తెలిపారు. బాధిత బాలిక తరఫున పోరాటం చేసిన బీఆర్ఎస్ మహిళా విభాగాన్ని ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినందించారు. ఈ కేసులో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా గట్టిగా పోరాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తోందని విమర్శించారు.

రౌడీ షీటర్లకు డీసీపీ ప్రత్యేక కౌన్సిలింగ్

- మిల్స్ కాలనీలో శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమం
- గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని సూచన
- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

వరంగల్, మే 17 : వరంగల్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ ధార కవిత, రౌడీ షీటర్లతో నేరుగా మాట్లాడి వారి ప్రవర్తన, పరిస్థితులపై ఆరా తీశారు. గతంలో నమోదైన కేసులు, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో మారాల్సిన అంశాలపై వారికి అవగాహన కల్పించారు. జీవితంలో మార్పు తీసుకురావాలంటే చట్టవ్యతిరేక చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని డీసీపీ తెలిపారు. చిన్నచిన్న వ్యక్తిగత విభేదాలు, తగాదాలు పెద్ద గొడవలకు దారితీసే అవకాశం ఉందని, వాటిని పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా గొడవలు, భూ వివాదాలు, దాడులు లేదా ఇతర నేర కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచినట్లు వెల్లడించారు. నగరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని డీసీపీ పేర్కొన్నారు. ప్రజల సహకారం కూడా పోలీసులకు అవసరమని, అనుమానాస్పద ఘటనలు లేదా వ్యక్తుల గురించి వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాజంలో నేరాల తగ్గుదలకు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఇంచార్జ్ హనుమకొండ ఏసీపీ నరసింహరావు, మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు. రౌడీ షీటర్లకు చట్టపరమైన అంశాలు, నేరాల వల్ల కలిగే పరిణామాలు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రభావం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం ద్వారా సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

225 కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా బాసర

గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు

నిర్మల్: చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయాన్ని రూ. 225 కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా లు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు గురించి ఆదివారం పర్యటించారు. ఆలయ ప్రాంగణం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వ్యాస గుహ తదితర ప్రాంతాలు తిరిగి చూశారు. మాస్టర్ ప్లాన్ అమలు గురించి కీలక అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసర మాస్టర్ ప్లాన్ అమలుతో ఆలయ రూపురేఖలు మారనున్నా యన్నారు. బాసర క్షేత్రం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ బాసర ఆలయ అభివృద్ధి కొరకు ఇటీవలి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు ద్వారా ఆలయం అభివృద్ధి చెందనుందని పేర్కొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర అనిర్వచనీయం

అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే

కరీంగనగర్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఘనంగా నిర్వహించబడుతున్న ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ -- విద్యా విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి గారు మాట్లాడుతూ, లివిద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత గురువు స్థానం అత్యంత గొప్పదని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని అన్నారు.లి పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శప్రాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, లిప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.లి ఒకప్పుడు ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపిన తల్లిదండ్రులు, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. లిప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు విద్య, క్రీడలు, సాంకేతిక రంగాలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్యార్థులు సాధిస్తున్న విజయాలు విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులకు నిదర్శనమని, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డారు.లి విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నంది శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆర్డీఓ మహేశ్వర్, విద్యాశాఖ ఏడి మాధవి, సెక్టోరల్ అధికారులు మిల్కురి శ్రీనివాస్ , అశోక్ రెడ్డి దాసి శ్రీనివాస్ ఉమారాణి మహేందర్, రవీందర్, డిసిఇబి కార్యదర్శి భగవంతయ్య, ఎంఈఓ లు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

థియేటర్ పర్సంటేజీ వివాదంపై ఫిల్మ్ ఛాంబర్ కసరత్తు

నిర్మాతలు, ఎగ్జిబిటర్లతో కీలక సమావేశం

సమస్య పరిష్కారానికి ప్రత్యేక సబ్ కమిటీ ఏర్పాటు

డి.సురేష్‌బాబు చైర్మన్‌గా కమిటీ నియామకం

హైదరాబాద్, మే 17 : తెలుగు చలనచిత్ర పరిశ్రమలో థియేటర్ యజమానులు, నిర్మాతల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న పర్సంటేజీ విధానం వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక అడుగు వేసింది. ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎగ్జిబిటర్ల సెక్టార్‌కు సంబంధించిన పర్సంటేజీల వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు ఫిల్మ్ ఛాంబర్ ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కమిటీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబును నియమించగా, కన్వీనర్లుగా నిర్మాతలు అల్లు అరవింద్, దిల్‌రాజును ఎంపిక చేశారు. సభ్యులుగా కేఎల్ నారాయణ, కె.అశోక్‌కుమార్‌లను నియమించారు. ఈ సబ్ కమిటీలో నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు సమాన ప్రాధాన్యం కల్పించినట్లు ఫిల్మ్ ఛాంబర్ వెల్లడించింది. థియేటర్ల నిర్వహణ ఖర్చులు, టికెట్ రెవెన్యూ షేరింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై కమిటీ చర్చించనుంది. వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరించి త్వరలోనే తుది నివేదికను ఫిల్మ్ ఛాంబర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం. దీంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు సామరస్యంగా పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

గురుకుల బదిలీలపై అపోహలు సరికాదు

హైదరాబాద్: "గురుకులాల్లో బదిలీల ప్రక్రియను అడ్డుకునేందుకు కొందరు వ్యక్తులు పత్రికల్లో తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచారం చేస్తున్నారు" అని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీగారియా) ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నర్సింహులు గౌడ్, జనరల్ సెక్రటరీ ఎస్. గణేష్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గురుకుల సంస్థల పరిపాలనా వ్యవస్థ సాధారణ విద్యాశాఖకు పూర్తిగా భిన్నమని వారు పేర్కొన్నారు. విద్యాశాఖ బదిలీ విధానాన్ని యథాతథంగా గురుకులాల్లో అమలు చేస్తే పరిపాలనా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో ఉపాధ్యాయులకు కనీస సర్వీస్ కాలం రెండు సంవత్సరాలు, గరిష్టంగా ఐదు సంవత్సరాల విధానం అమల్లో ఉందని తెలిపారు. ప్రిన్సిపాళ్లకు గరిష్ట సర్వీస్ నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. ఈ విధానం గతంలో ఎప్పుడూ విద్యాశాఖ బదిలీ విధానానికి అనుసంధానం కాలేదని స్పష్టం చేశారు. విద్యాశాఖలో పోస్టులు జిల్లా క్యాడర్ పరిధిలో ఉండగా, గురుకులాల్లో పోస్టులు జోనల్, మల్టీజోనల్, స్టేట్ క్యాడర్ పరిధిలో ఉంటాయని పేర్కొన్నారు. అందువల్ల విద్యాశాఖలో అమలవుతున్న ఎనిమిది సంవత్సరాల విధానాన్ని ఇక్కడ అమలు చేయడం సాధ్యం కాదన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు బదిలీ ప్రక్రియపై అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించిన టీగారియా నేతలు, ప్రస్తుతం అమల్లో ఉన్న 2-5 సంవత్సరాల బదిలీ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త బంద్

- ఈ నెల 20న ఫార్మసీ బంద్‌కు పిలుపు
- చైన్ ఫార్మసీల డిస్కౌంట్లపై కెమిస్టుల ఆందోళన
- ప్రజారోగ్యానికి ముప్పుగా అక్రమ మందుల విక్రయాలు
- తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నేతలు

హైదరాబాద్, మే 17 : ఆన్‌లైన్ ఫార్మసీల అక్రమ విక్రయాలు, చైన్ ఫార్మసీల మితిమీరిన డిస్కౌంట్లకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్త ఫార్మసీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఈ మేరకు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్, డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావుకు అసోసియేషన్ ప్రతినిధులు లేఖ అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్‌లైన్ మందుల అమ్మకాలు, కార్పొరేట్ చైన్ ఫార్మసీలు ఇస్తున్న భారీ డిస్కౌంట్ల వల్ల సాధారణ రిటైల్, హోల్‌సేల్ కెమిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఫార్మా రంగంలో లాభాల మార్జిన్లు చాలా పరిమితంగా ఉంటాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ సంస్థలు ఇచ్చే భారీ డిస్కౌంట్లను తట్టుకుని దేశవ్యాప్తంగా ఉన్న చిన్న, మధ్యతరహా వ్యాపారులు నిలదొక్కుకోవడం కష్టంగా మారిందని పేర్కొంది. దీంతో చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని తెలిపింది. ఆర్థిక నష్టాలతో పాటు నియంత్రణ లేని ఆన్‌లైన్ విక్రయాల వల్ల ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని అసోసియేషన్ హెచ్చరించింది. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అందుబాటులో ఉండటంతో యువత సెల్ఫ్ మెడికేషన్‌కు అలవాటు పడుతోందని వెల్లడించింది. నాణ్యత లేని, నకిలీ మందులు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం పెరిగిందని, మందుల దుర్వినియోగం, డ్రగ్ నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆన్‌లైన్, చైన్ ఫార్మసీల అనైతిక డిస్కౌంట్ విధానాలపై నియంత్రణ తీసుకురావాలని, చిన్న తరహా వ్యాపారుల ట్రేడ్ మార్జిన్లను రక్షించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. నకిలీ, నాణ్యత లేని మందుల సరఫరాను అడ్డుకోవడంతో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా జరుగుతున్న అక్రమ మందుల అమ్మకాలను పూర్తిగా నిరోధించాలని కోరింది. ఫార్మా రంగంలో పారదర్శకత, నైతిక వ్యాపార ప్రమాణాలు నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి.రాజు, కోశాధికారి పి.కృష్ణకుమార్ పిలుపునిచ్చారు.

టీజీఎస్ఆర్టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్‌కు కొత్త కమిటీ

- అధ్యక్షుడిగా ఇ.అశోక్ ఏకగ్రీవ ఎన్నిక
- హైదరాబాద్‌లో జనరల్ బాడీ సమావేశం
- సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామన్న నూతన కార్యవర్గం

హైదరాబాద్, మే 17 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఇ.అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో అసోసియేషన్ నూతన సెంట్రల్ కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూపర్‌వైజరీ సిబ్బంది సంక్షేమం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందని ప్రతినిధులు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీలో చీఫ్ అడ్వైజర్‌గా కె.వాసుదేవరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ప్రమోద్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజు, జనరల్ సెక్రటరీగా జి.రామారావు, ట్రెజరర్‌గా కె.రేవణి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా వి.స్నేహలత, శ్రీపతి కృష్ణ, బి.సత్తయ్య, బి.మహేష్, ఆర్.శ్రీనివాస్ ఎన్నికవగా, జాయింట్ సెక్రటరీలుగా బి.వెంకటస్వామి, బి.నవీన్ యాదవ్, డి.వెంకట్‌రామ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఇ.అశోక్‌తో పాటు కమిటీ సభ్యులందరూ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న జనరల్ బాడీ సభ్యులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య లక్ష్యం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, మే 17 : ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. జగిత్యాల జిల్లా పదో తరగతి ఫలితాల్లో 98.88 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నాలుగో స్థానం పొందడం అభినందనీయమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.8 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే సరిపోదు.. సత్తా చాటాల్సిందే!

- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేష్ బాబు
- హయత్‌నగర్ డిగ్రీ కాలేజీలో ముగిసిన విద్యా వారోత్సవాలు
- టాపర్లకు, ర్యాంకర్లకు కాసుల పంట.. సత్కారాల హోరు!

ఎల్బీనగర్, మే 17 (మనసులో మాట): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 11–17 వరకు వారం రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన "విద్యా వారోత్సవాలు" కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు అధ్యక్షతన ముగింపు వేడుకలు ముగిశాయి. ఈ వారోత్సవాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ఉపాధి అవకాశాల మెరుగుదలకు దోహదపడేలా ప్రతిరోజూ వైవిధ్యభరితమైన కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ విద్యా వారోత్సవాలు మన విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపాయి. కేవలం తరగతి గది విద్యకే పరిమితం కాకుండా, సాంకేతిక పరిజ్ఞానం ఏ ఐ సామాజిక సేవ (ఎన్ఎస్ఎస్), నైపుణ్య శిక్షణ వంటి అంశాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించినప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు శారీరక దృఢత్వం, సాంస్కృతిక చైతన్యం అవసరమని ఈ వారం రోజుల్లో జరిగిన వైవిధ్యభరిత కార్యక్రమాలు నిరూపించాయి. ఈ వారోత్సవాల విజయవంతానికి సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, ఆర్థిక సాయం అందించిన దాతలకు, పూర్వ విద్యార్థులకు, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

2024–25 విద్యా సంవత్సరంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ విద్యార్థులు బి.ఎ బి. నితీన్, పన్నాల సుమన్, బి.కామ్ ముదావత్ రాజు, ఎన్. పవన్ కుమార్, తంగెళ్ళ మనీష, బి.ఎస్సీ లైఫ్ సైన్స్ బెజ్జంకి శ్రీదేవి, బక్రామ్ యమున, బి.ఎస్సీ ఫిజికల్ సైన్స్ బోడిసె భార్గవి, వెంకటాపురం బాలాజీ, జువాలజీ తెలంగాణ పిజీసెట్ లో రాష్ట్ర స్తాయిలో 2వ ర్యాంక్ సాధించిన తేజశ్రీ, తెలంగాణ హైకోర్టులో ఉద్యోగం సంపాదించిన అనిల్ కుమార్ లను, 2025 –26 విద్యా సంవత్సరం విద్యార్థులు – ఎన్.సి.సి. క్యాడెట్స్ – కృతిక బిఎ తృతీయ సంవత్సరం, మల్లేశ్వరి బిఎ తృతీయ సంవత్సరం, ప్రీ రిపబ్లిక్ డేలో పాల్గొన్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ – మీన బిఎ తృతీయ సంవత్సరం, గణేష్ బిఎ తృతీయ సంవత్సరం, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న కె. ధోని బిఎ ద్వితీయ సంవత్సరం, సౌమ్య బికామ్ ప్రథమ సంవత్సరం, కె. మహేష్ – – బిబిఎ తృతీయ సంవత్సరం, సాంస్కృతిక అంశాలు ప్రదర్శించిన అన్సుల్ బిఎ ప్రథమ సంవత్సరం, రితిష –– బిబిఎ ద్వితీయ సంవత్సరం, అక్షయ్ బికామ్ ప్రథమ సంవత్సరం లను బహుమతు లతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. బి. నరసింహ, ఐక్యుఏసి కో ఆర్డినేటర్ డా. డి. మధు, సీనియర్ ఆధ్యాపకులు డా. ఎస్ సుబ్రహ్మణ్యం, కళాశాల సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డా. అపర్ణాచతుర్వేది, వ్యాయామ విద్య అధ్యాపకులు డా. అనిత, గ్రంథ పాలకులు డా. దుర్గ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. ఈ. యాదగిరి రెడ్డి, డా ఎస్. శారద, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులు సహకారం మరింత సేవ చేసేందుకు ప్రేరణనిస్తుంది

కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, మే 17 (మనసులో మాట): ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ కాలనీవాసులు స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. తమ కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేసిన కాలనీ వాసులు, ఈ అభివృద్ధి పనులకు కృషి చేసిన నవ జీవన్ రెడ్డిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి కావడం వల్ల కాలనీలో రవాణా సౌకర్యం మెరుగుపడిందని, వర్షాకాలం లో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా కళ్లెం నవజీవన్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ

ప్రజల ఆశీస్సులు, సహకారమే తనకు మరింత సేవ చేసేందుకు ప్రేరణనిస్తుందని తెలిపారు. హయత్‌నగర్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రతి కాలనీలో వసతుల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పేల్లకూరి సుబ్బారెడ్డి, అధ్యక్షులు యాకాల రాజ్ కుమార్, జనరల్ సెక్రెటరీ కేమ జనార్ధన్, సభ్యులు కడారి సత్యనారాయణ, ముక్కాముల అంజయ్య, కట్ట మల్లయ్య, సరికొండ రామ్ రెడ్డి, శనగపాటి సునీల్, బత్తుల మల్లేశం, గుండారపు రాజారాం, గుర్రం శ్రీనివాస్, జయ ప్రకాష్, జానకిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ

మెదక్: రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో టిజిఐఆర్డి హైదరాబాద్ లో మూడు రోజులు జరగ్గా దోపిడీ, అక్రమ రవాణా, కార్మిక దోపిడీలను నివారించడానికి, ప్రతిస్పందించడానికి బాలల రక్షణ వ్యవస్థలను మెరుగుపరచడం అనే ఎజెండా అంశంలో పదిమంది పాల్గొనగా 8 మంది విజేతలుగా మెదక్ జిల్లాకు చెందినవారే కావడం విశేషం. ఆలాగే ప్రెస్ సభ్యుడిగా ఎంపికైన శంకరంపేట్ (ఆర్) కు చెందిన అబ్బాయికి స్పెషల్ మెన్షన్ అవార్డు లభించింది. యూనిసెస్ కమిటీలో భాగంగా స్పెషల్ డెలిగేటుగా పి.పూజ, హై కమెండేషన్స్ వన్ గా బి. అభిజ్ఞ, హై కమెండేషన్ టు గా ఎల్ వనిషిక, స్పెషల్ మెన్షన్ గా కె.అభిజ్ఞ, హానరబుల్ మెన్షన్ లో టీ. జయశ్రీ, ఆర్సియా ఫాతిమా, పి ఐశ్వర్య, ఏ.సమీక్ష విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయి నుండి ఎన్నికైన 11 మందిలో 9 మంది విజేతలుగా నిలవడం మెదక్ జిల్లాకు గర్వకారణం. ఇందుకు కారకులైన అందరికి జిల్లా విద్యాధికారి రాజు అభినందనలు తెలిపారు.

గజ్జి భాస్కర్‌కు సన్మానం

ఎల్బీనగర్, మే 17 (మనసులో మాట): తెలంగాణ ఉద్యమకారుడు జెనిగె విష్ణువర్ధన్ జై భీమ్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం, హయత్ నగర్ పాత జాతీయ రహదారి, అన్మగల్ బస్తి లోని అంబేద్కర్ విగ్రహానికి 180 వ జ్ఞానమాల సందర్భంగా ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ హాజరై, వారి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అన్మగల్ బస్తి కమిటీ అధ్యక్షులు జెనిగె కుమార్ శాలువా వేసి భాస్కర్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత బోడ నరసింహ, గంగని కిషన్, బోడ యాదయ్య, గంగని రాము, కాటేపాక యాదయ్య, కాటపాక నరసింహ, జెనిగె గిరి, ఆర్ రజిని తదితరులు, పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో వైభవంగా నిత్య కళ్యాణం

శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణలు

యాదాద్రి, మే 17 : స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. శ్రీవారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ట దర్శనం నిర్వహించి, వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామికి సహస్ర నామార్చన సేవ గావించారు. లోక కళ్యాణం కోసం దివ్యక్షేత్రంలో శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. అన్నప్రసాద వితరణలో భాగంగా సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మాడవీధుల్లో శోభాయమానంగా ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళాలు, మృదంగ నాదాల మధ్య తిరువీధి ఉత్సవ సేవ వైభవంగా సాగింది. తిరువీధి ఉత్సవం అనంతరం సహస్ర దీపాల కాంతుల మధ్య ఊయల సేవ నిర్వహించారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో కర్పూర మంగళహారతులు సమర్పించగా, భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం

- 15 కోట్ల భోజనాలు మైలురాయి పూర్తి చేసిన
- హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్

హైదరాబాద్, మే 17 (మనసులో మాట): హైదరాబాదు లోని నర్సింగిలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం, 15 కోట్ల సమిష్టి భోజనాల పూర్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై, ఆధునిక వంటశాల పరికరాలను ప్రారంభించారు. ఆరోబిందో ఫార్మా సహకారంతో గత దశాబ్ద కాలంగా నిరుపేదలు, రోగులకు అవసరమైన వారికి పోషకాహార భోజనాలను అందిస్తున్న ఫౌండేషన్ సేవలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ఆటోమేటెడ్ దోసె తయారీ యంత్రం, వెసెల్ సీలింగ్ యంత్రాన్ని ప్రారంభించడంతో పాటు ఆహార పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ "మన పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదు" అనే లక్ష్యంతో ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరోబిందో ఫార్మా, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో లక్షలాది మందికి సేవలందించడం సాధ్యమైందన్నారు. ప్రస్తుతం హెచ్ కె ఎం సి ఎఫ్ ప్రతిరోజూ సుమారు 71 వేల భోజనాలను పంపిణీ చేస్తూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలియజేశారు.

గురుకులాల నిర్మాణం పరిపాలనా క్యాడర్ విధానం

సాధారణ విద్యా శాఖకు పూర్తి భిన్నం

అలగోని నర్సింహులు గౌడ్, ఎస్. గణేష్

ఎల్బీనగర్, మే 17 (మనసులో మాట): విద్యాశాఖ బదిలీ విధానాన్ని యథాతథంగా అమలు చేయడం సరికాదు, బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగులకు కల్పించిన బదిలీల వెసులుబాటును కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తూ, పత్రికలలో తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచారం చేసి గురుకులాల్లో బదిలీల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీగారియా రాష్ట్ర అధ్యక్షులు అలగోని నర్సింహులు గౌడ్, జనరల్ సెక్రటరీ ఎస్. గణేష్ లు మాట్లాడుతూ గురుకుల సంస్థల నిర్మాణం, పరిపాలనా వ్యవస్థ, క్యాడర్ విధానం సాధారణ విద్యాశాఖకు పూర్తిగా భిన్నమని స్పష్టం చేశారు. అలాంటి ప్రత్యేక వ్యవస్థపై విద్యాశాఖ బదిలీ విధానాన్ని యథాతథంగా రుద్దడం పరిపాలనా పరంగా తీవ్ర సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులకు కనీస సర్వీస్ రెండు సంవత్సరాలు, గరిష్ట సర్వీస్ ఐదు సంవత్సరాలు అమలులో ఉండగా, ప్రిన్సిపాళ్లకు గరిష్ట సర్వీస్ నాలుగు సంవత్సరాల విధానం అమలులో ఉందన్నారు. ఈ విధానం గతంలో ఎప్పుడూ విద్యాశాఖ బదిలీ విధానానికి అనుసంధానం కాలేదని గుర్తు చేశారు. విద్యాశాఖలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పోస్టులు జిల్లా క్యాడర్ పరిధిలో ఉండటంతో ఎనిమిది సంవత్సరాల సర్వీస్ ప్రమాణం అమలు సాధ్యమవుతుందని, కానీ గురుకులాల్లో పోస్టులు జోనల్, మల్టీజోనల్, స్టేట్ క్యాడర్ పరిధిలో ఉండటం వల్ల అదే విధానాన్ని అమలు చేస్తే ఉద్యోగులు, సంస్థలు రెండూ ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గురుకులాల్లో ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాలకు మించి కొనసాగినప్పుడు గ్రౌండ్ లెవెల్‌లో తలెత్తే పరిపాలనా, సామాజిక, వ్యవస్థాపక సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే గతంలో జరిగిన బదిలీలలో కూడా విద్యాశాఖలో అమలవుతున్న ఎనిమిది సంవత్సరాల విధానాన్ని యథాతథంగా అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రత్యేకంగా 317 జీవో లోకలైజేషన్ ప్రక్రియ సమయంలో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఐదు సంవత్సరాల సర్వీస్‌ను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.ఎంఎస్ నెం.38, తేదీ 21-04-2026, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్, తెలంగాణ, హైదరాబాద్ జారీ చేసిన సర్క్యులర్ మెమో నెం. జ1/5697/2026, తేదీ 23-04-2026 ప్రకారం గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో పాల్గొనే అవకాశం కల్పించబడినట్లు స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. అయితే కొద్దిమంది వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ నిర్ణయాలను వక్రీకరిస్తూ, బదిలీల ప్రక్రియను నిలిపివేయాలనే ఉద్దేశంతో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇది ఉద్యోగుల హక్కులను హరించే చర్యగా టీగారియా అభివర్ణించింది. ప్రస్తుతం అమలులో ఉన్న 2--5 సంవత్సరాల బదిలీ విధానాన్నే కొనసాగిస్తూ, ఒకే ప్రాంతంలో గరిష్ట సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీల అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సెన్సెస్ డ్యూటీల్లో ఉన్న పోస్టులను ఖాళీలుగా పరిగణించి బదిలీలలో చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి బాహ్య ఒత్తిళ్లకు లోనుకాకుండా సంక్షేమ గురుకులాల్లో బదిలీల ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, సంబంధిత మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని టీగారియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.